క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కాటేదాన్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ సంజీవయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ కోత ఉంటుందన్నారు. గంగోత్రి విద్యుత్ ఫీడర్, కాటేదాన్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పారిశ్రామికవాడలు, సాయిబాబానగర్ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందని మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

రేపు ట్రాఫిక్ ఆంక్షలు

మణికొండ: నార్సింగి మున్సిపల్ కోకాపేట్‌లోని శ్రీకృష్ణ గోశాలలో నిర్మించనున్న హరేకృష్ణ హెరిటేజ్ టవర్స్ పూజా కార్యక్రమాల నేపథ్యంలో సోమవారం ట్రాఫిక ఆంక్షలు చేపడుతున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. కోకాపేట్ టీ జంక్షన్ నుంచి కోకాపేట్ రోడ్డు, కోకాపేట్ గ్రామం జంక్షన్ నుంచి గోషాల వరకు, ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్లను క్లోజ్ చేస్తున్నామన్నారు.

సాయన్న విగ్రహావిష్కరణకు ఆహ్వానం



తలారి మల్లేష్‌కు ఆహ్వాన పత్రికను ఇస్తున్న షాద్‌నగర్ ముదిరాజ్ నాయకులు

మణికొండ: పాలమూరు విప్లవ యోధుడు పండగ సాయన్న ముదిరాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలిరావాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తలారి మల్లేష్‌ను షాద్‌నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు ఆహ్వానించారు. ఈనెల 14న షాద్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఆయన విగ్రహాన్ని ముదిరాజ్ ప్రముఖులు హాజరై ఆవిష్కరిస్తున్నారని, రాజేంద్రనగర్ నియోజకవర్గం, రంగారెడ్డి జిల్లా పరిధిలోని ముదిరాజ్‌లంతా ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.


వన్యప్రాణుల రక్షణకు చేయూత.. దరఖాస్తుల ఆహ్వానం..

సాక్షి, సిటీబ్యూరో: సహజ సిద్ధమైన పరిసరాలు, స్వదేశీ జాతుల రక్షణ కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ హాబీటాట్స్ ట్రస్ట్ తమ వార్షిక హాబిటాట్స్ ట్రస్ట్ గ్రాంట్స్ కోసం నగరానికి చెందిన వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. అంతరించే దశలో ఉన్న వన్యప్రాణులతో పాటు సహజమైన పరిసరాల పరిరక్షణ కోసం కృషి చేస్తోన్న సంస్థలు, వ్యక్తుల ప్రయత్నాలను ప్రోత్సహించేందుకు ఈ గ్రాంట్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. వచ్చే నెల 5వ తేదీలోగా పంపాల్సిన ఈ దరఖాస్తులకు అర్హత తదితర విషయాల గురించి https:// www.thehabitatstrust.org వెబ్‌సైట్‌ను సందర్శించాల్సిందిగా కోరారు.

సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సాగే ఈ కార్యక్రమంలో 'ఆర్ట్ ఆఫ్ విన్నింగ్' అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన సీనియర్ రాజయోగ టీచర్, మోటివేషనల్ స్పీకర్ బి.కె. మాధవి ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

డా. జానీ వర్గీస్‌కు పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఇటీవలే పీహెచ్‌డీ పూర్తి చేసిన డాక్టర్ జానీ వర్గీస్‌కు ప్రతిష్టాత్మక పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ లభించింది. హెచ్‌సీయూలోని మెటీరియల్ ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన డాక్టర్ జానీ హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ(ఎస్ఈఎస్‌టీ) ప్రొఫెసర్ కోటేశ్వరరావు ,రాజులపాటి పర్యవేక్షణలో ఇటీవలే పీహెచ్‌డీ పూర్తి చేశారు. డాక్టర్ జానీ వర్గీస్ ప్రతిష్టాత్మకమైన 'స్టార్' సెన్సింగ్‌కి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమం కింద డాక్టర్ వర్గీస్ యూనివర్శిటీ ఆఫ్ సీజెన్ ప్రొఫెసర్ రాబర్ట్ బ్రాండ్ట్ ఆధ్వర్యంలో స్వతంత్ర పరిశోధన చేస్తారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం

మేయర్ మహేందర్‌గౌడ్



మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. హిమాయత్‌నగర్‌లోని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ముఖ్యమంత్రి కప్-2023లో భాగంగా మండల స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మేయర్ మహేందర్‌గౌడ్ హాజరయ్యారు. గండిపేట్ మండలంలో మే 15, 16, 17వ తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాలనుసారం మండల స్థాయిలో ఐదు విభాగాల్లో పోటీలు చేపడుతున్నామన్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు ఉంటాయన్నారు. క్రీడాకారులు తమ పేరు, టీమ్ నమోదును ఈనెల 12వ తేదీ లోపు చేసుకోవాలన్నారు. నార్సింగి మున్సిపల్ శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరామ్ 9951790097లో సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. ఒక క్రీడాకారుడు ఒక మండలం తరపున మాత్రమే ఆడాల్సి ఉంటుందన్నారు. పై విభాగాల్లో పురుషులు, మహిళలకు 15-36 ఏళ్ల వయస్సు ఉండాలని తెలిపారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్‌లో 11 మంది టీమ్ సభ్యులతో పాటు ముగ్గురు అదనంగా ఉండాలి, కబడ్డీలో 7 మంది టీమ్ సభ్యులతో పాటు ముగ్గురు అదనంగా ఉండాలి, ఖోఖోలో 9 మంది టీమ్ సభ్యులతో పాటు ముగ్గురు అదనంగా ఉండాలి, వాలీబాల్‌లో ఆరుగురు టీమ్ సభ్యులతో పాటు ముగ్గురు అదనంగా ఉండాలని సూచించారు. క్రీడాకారులకు ఎలాంటి సందేహాలు ఉన్నా కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపల్ కమిషనర్ సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



హోమం పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ భగవత్‌గూడలో భవానీ, శివ, సాయి, ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం సాగుతోంది. ఈనెల 4వ తేదీ నుంచి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలను బ్రహ్మశ్రీ రేపల్లి రాజేష్‌శర్మ పంతులు ఆధ్వర్యంలో వేదపండితులు ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవాలయ వ్యవస్థాపకులు, సంఘ సేవకులు దేవిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఈ ఆలయంలో శివ, భవానీ, గణపతి, సుబ్రహ్మణ్య, నాగదేవత, నంది, ఆంజనేయ, ధ్వజస్తంభ, సాయిబాబా, నవగ్రహ, బలిపీఠ శిఖర దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఆదివారం దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం కొనసాగుతుందని.. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దేవిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు.

రోడ్డు విస్తరణకు సహకరిస్తాం



సమావేశంలో పాల్గొన్న బాధితులు, అధికారులు

మణికొండ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల వెడల్పు చేపట్టాల్సిందేనని, అందుకు తామంతా సహకరిస్తామని, మరోమారు మార్కింగ్ వేసి పనులను త్వరగా పూర్తి చేయాలని అలిజాపూర్-అలకాపూర్ రోడ్డు వెడల్పు బాధితులు పేర్కొన్నారు. శనివారం మణికొండ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఫల్గుణ్‌కుమార్ సారథ్యంలో హెచ్‌ఎండీఏ సీపీఓ రవీందర్‌రెడ్డి, హెచ్ఆర్‌డీసీఎల్ డీఈ రాజారాంతో సదరు రోడ్డులో గృహాలు, స్థలాలు కోల్పోతున్న వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు గతంలో వేసిన మార్కింగ్‌లు ఓసారి అడుగులలో, మరోసారి మీటర్లలో కొలతలు తీసి మార్కింగ్‌లు వేశారన్నారు. కొన్ని స్థలాల్లో సెట్ బ్యాక్ ప్రకారం నిర్మాణాలు చేసుకున్న వారి భవనాలకు అదే కొలతలతో మార్కింగ్‌లు చేశారన్నారు. హెచ్‌ఎండీఏ టౌన్ ప్లానింగ్ ప్రకారం వంద అడుగుల వెడల్పు రోడ్డు ఉన్నా 80 అడుగుల వెడల్పుకు తామంతా అంగీకరిస్తామన్నారు. మరోమారు సరైన మార్కింగ్ చేసి పనులను ప్రారంభించుకోవచ్చన్నారు. పలువురు లేవనెత్తిన అనుమానాలను అధికారులు నివృత్తి చేయటంతో రోడ్డు వెడల్పునకు వారంతా అంగీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టీపీఓ రాకేష్, కో ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, ఎంఐఎం పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు రిజ్వాన్‌లతో పాటు పలు కాలనీలవాసులు పాల్గొన్నారు.

'మనబస్తీ-మనబడి'తో అభివృద్ధి



అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

- శేరిలింగంపల్లిలో 31 పాఠశాలల్లో మౌలిక వసతులు
- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి 'మనబస్తీ-మనబడి' ప్రత్యేక కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెల్లడించారు. గచ్చిబౌలి డివిజన్‌లో మొత్తం రూ.1.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనుల్లో భాగంగా.. రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.04 కోట్ల వ్యయంతో, మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో రూ.46 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ఆయన శనివారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మొదటివిడత కింద మొత్తం 31 ప్రభుత్వ పాఠశాలలుండగా శేరిలింగంపల్లి మండలంలో 24 పాఠశాలలు, కూకట్‌పల్లిలో ఏడు ప్రభుత్వ పాఠశాలలకు ఈ అవకాశాన్ని కల్పించామన్నారు. ముఖ్యంగా అదనపు తరగతి గదులు, క్లాస్‌రూమ్‌లో డ్యూయల్ డెస్క్‌లు, విద్యుత్, టాయిలెట్లు, మంచినీరు, వంటగదులు, భోజనశాలలు, వాకింగ్ ట్రాక్‌లు, ప్రహరీ ఇలా అనేక సకల సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఈడబ్ల్యూడీసీ ఏఈ శ్యామ్, హెచ్ఎం తాజ్‌బాబు, నాయకులు రాజునాయక్, చెన్నంరాజు, సత్యనారాయణ, సంపత్, రమేష్ గౌడ్, కృష్ణయాదవ్, శ్యామ్‌యాదవ్, సతీష్ యాద గిరి, సలావుద్దీన్, విద్యా కమిటీ సభ్యులు కృష్ణగౌడ్, సురేష్, నరేందర్, దేవేందర్, నరేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఆలయ శిలాన్యాస మహోత్సవం

మణికొండ: విశాఖ శారదా పీఠం ఆధ్వర్యంలో కోకాపేటలో నిర్మిస్తున్న శారదా స్వరూప రాజశ్యామలా అమ్మవారి ఆలయ శిలాన్యాస మహోత్సవాన్ని ఆదివారం ఉదయం 11.07 గంటలకు నిర్వహిస్తున్నామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వారు వివరించారు. ఇప్పటి వరకు విశాఖపట్నంలోనే అమ్మవారి ఆలయం ఉండేది. రాష్ట్రంలో కోకాపేటలో మరో ఆలయం నిర్మిస్తున్నామన్నారు. ఆలయం ప్రాచీన సంప్రదాయాలకు అనుగుణంగా భక్తి పరిమళయుతమైన నందనోద్యానంగా రాష్ట్రానికి మణిదీపంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఆదివారం జరిగే కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవతం చేయాలని వారు కోరారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

గన్‌ఫౌండ్రీ: సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెలంగాణ మహిళా విశ్వ విద్యాయలం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ విజ్జులత అన్నారు. శనివారం రవీంద్రభారతిలో అనిబిసెంట్ మహిళా కళాశాల స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోషల్ మీడియా పట్ల బాలికలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డిగ్రీ పట్టాలు పొందుతున్నారంటే జీవితం ఆరంభమవుతున్నట్లే అన్నారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు.

ఉచిత వైద్య శిబిరం



రాజేంద్రనగర్: మేడే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కాటేదాన్‌లో 6వ రోజు లక్ష్మి హాస్పిటల్ డాక్టర్ భాస్కర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కార్యదర్శి చంద్రమోహన్ హాజరై ఉచిత హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో అనేక పరిశ్రమలలో కార్మికులకు ఈఎస్ఐ వసతి కల్పించకుండా కార్మికుల రోగాల బారిన పడి అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ డిస్పెన్సరీతో పాటు అన్ని వసతులు కల్పించకుండా డిస్పెన్సరీలో టెస్టులకు సంబంధించిన పరికరాలు ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా కేవలం బీపీ, షుగర్ టాబ్లెట్స్ మాత్రమే ఇస్తున్నారన్నారు. సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కన్వీనర్ రుద్రకుమార్, శంషాబాద్ మండల కన్వీనర్ మల్లేష్, గండిపేట మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, రాజేంద్రనగర్ మండల సమన్వయ కమిటీ సభ్యులు వెంకటయ్య, రహీం, కృష్ణ పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డు పనులు



పనులను పరిశీలిస్తున్న దృశ్యం

శంషాబాద్: ప్రజలకు నిత్యం ఇబ్బందికరంగా మారిన రోడ్డు పనులకు స్థానిక కౌన్సిలర్ సొంత నిధులతో ప్రారంభించారు. పట్టణంలోని తొండుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, మరో ప్రైవేటు పాఠశాలకు జాతీయ రహదారి పక్క నుంచి రాకపోకలు సాగించేందుకు వీలు లేకపోవడంతో ఇటీవల స్థానిక కౌన్సిలర్ పారెపల్లి లావణ్య తన సొంత డబ్బులతో పనులను ప్రారంభించారు. రోడ్డు పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు విడుదల కాకపోయినా ప్రజల సౌకర్యం కోసం సొంత ఖర్చులతో చేపట్టిన రోడ్డుపనులను శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పారెపల్లి శ్రీనివాస్‌గౌడ్, పెంటయ్య, సుదర్శన్‌గౌడ్, పరమేష్‌గౌడ్, సురేష్‌కుమార్, అశోక్, రాజు, నరేష్, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

నిరుద్యోగ భరోసా సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

మణికొండ: ఈనెల 8న సరూర్‌నగర్‌లో జరిగే నిరుద్యోగ భరోసా సభకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నిరుద్యోగులు, యువత తరలిరావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ కోరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మాజీ సర్పంచ్‌లతో నార్సింగి కాంగ్రెస్ పార్టీ కర్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతుందని ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడితే ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ 8 ఏళ్ల పాలనలో ఉద్యోగాల కల్పనలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈనెల 8న ప్రియాంక గాంధీ హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గండిపేట మండల అధ్యక్షులు అశోక్‌యాదవ్, మండల అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్, ఏ-బ్లాక్ అధ్యక్షుడు నవీన్, బి-బ్లాక్ అధ్యక్షుడు ఖలీద్, దుద్దు కిరణ్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు జితేందర్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బాలరాజు, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, శాస్త్రీపురం డివిజన్ అధ్యక్షుడు తాజుద్దీన్, పాపిరెడ్డి, సయ్యద్ ఖాదర్, కౌన్సిలర్లు విజయ్, దుర్గేష్, శ్రీనివాస్, కిరణ్, రాము పాల్గొన్నారు.

ఆలయ పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట చెన్నకేశవ స్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈఓ శివరుద్రప్ప ఈ మేరకు నూతన పాలక మండలి సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రవి, ఉమారాణి, మీనాక్షి, చంద్రశేఖర్, జుర్కీ సంతోషి రాణి, అర్చనచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ పాలక మండలి ఏడాది పాటు కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. పాలక మండలి సమావేశమై నూతన చైర్మన్‌ను ఎన్నుకుంటారన్నారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులు దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, హోం మంత్రి మహమూద్ అలీ లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో మెంబర్ కంజర్ల ప్రతాపాచార్యులు, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్, స్థానిక నాయకులు జుర్కీ రాజేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

'కర్ణాటకలో కాంగ్రెస్ విజయం ఖాయం'

గోల్కొండ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టి అధికారంలోకి వచ్చే బీజేపీ నైజాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని ఆయన అన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలలో ప్రజాస్వామ్య బద్ధంగా ప్రభుత్వాలను పడగొట్టి దొడ్డిదారిన అధికారాలను కైవసం చేసుకుందని ఆయన అన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

యాకుత్‌పురా: ప్రభుత్వం అందజేసే సంకేమ పథకాలను అర్హులైన పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. చార్మినార్ మండల కార్యాలయ అధికారుల ఆధ్వర్యంలో శనివారం తలాబ్‌కట్టాలోని షాజహాన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అర్హులైన 93 మంది లబ్ధిదారులకు షాదీ ముబారాక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న పేదలు సంక్షేమ పథకాలపై అవగాహన ఏర్పార్చుకోవాన్నారు. నియోజకవర్గంలోని అనేక మంది పేదలకు షాదీ ముబారాక్ పథకం ద్వారా ఎంతో మేలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తలాబ్‌చంచలం, డబీర్‌పురా, మొఘల్‌పురా డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనాబేగం, అలాందార్ వాలాజహి, నస్రీన్ సుల్తానా, చార్మినార్ డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ అసిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద నిలిచిన క్యాబ్‌లు



ఆందోళన చేస్తున్న క్యాబ్ డ్రైవర్లు

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద క్యాబ్ డ్రైవర్‌లు శనివారం రాత్రి ఆందోళనకు దిగారు. దీంతో వందలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. క్యాబ్‌లు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎయిర్‌పోర్టులో విధులు నిర్వహించే ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు ఒకరు క్యాబ్ డ్రైవర్‌పైన చేయి చేసుకోవడమే డ్రైవర్‌ల ఆందోళనకు దారితీసినట్లు తెలంగాణ గిగ్‌అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది తమ డ్రైవర్‌ల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. శనివారం రాత్రి సీరియల్ ప్రకారం వెళ్లాల్సిన ఒక క్యాబ్ డ్రైవర్‌ను పక్కకు నెట్టి అతని తరువాత లైన్‌లో ఉన్న మరో డ్రైవర్‌ను అనుమతించడంతో ఘర్షణ మొదలైంది. తన కంటే వెనుక ఉన్న వ్యక్తిని ఎలా పంపిస్తారని డ్రైవర్ గొడవకు దిగాడు. దీంతో సెక్యూరిటీ గార్డు సదరు డ్రైవర్‌ను తీవ్రంగా దుర్భాషలాడడమే కాకుండా కొట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలో తోటి క్యాబ్ డ్రైవర్‌లంతా అక్కడకు చేరుకొని ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో సెక్యూరిటీ గార్డులకు, డ్రైవర్ల మధ్య ఘర్షణ చోటుచేసుకొంది. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాల మధ్య ఘర్షణను నివారించినప్పటికీ కొద్దిసేపు సద్దుమణిగి తరువాత తిరిగి అర్ధరాత్రి వరకు ఆందోళన కొనసాగింది. ఈ క్రమంలో విదేశాల నుంచి, వివిధ నగరాల నుంచి నగరానికి చేరుకొన్న ప్రయాణికులు సకాలంలో ఇంటికి చేరుకోలేక ఇబ్బందులకు గురయ్యారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీకాంత్(33), శిరీష భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏప్రిల్ 29న శిరీషా కొత్తూర్‌లోని అమ్మవారి ఇంటికి కుటుంబసభ్యులు వెళ్లారు. శుక్రవారం రాత్రి వరకు అక్కడే ఉన్నారు. ఈ సమయంలో భార్యాభర్తలకు మధ్య గొడవ జరగడంతో రాత్రి 11 గంటల ప్రాంతంలో శ్రీకాంత్ ఒక్కడే శ్రీరామ్‌నగర్‌లోని ఇంటికి చేరుకున్నాడు. మనస్తాపానికి గురైన శ్రీకాంత్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేతాజీనగర్ సమస్యలు పరిష్కరించాలని వినతి

శేరిలింగంపల్లి: నేతాజీనగర్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం బృందం జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. శనివారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఈఈ శ్రీనివాస్‌ను కాలనీ అధ్యక్షులు భేరి రాంచందర్‌యాదవ్, ఉపాధ్యక్షుడు ఎండి కమ్మర్‌పాషా, ప్రతినిధులు నర్సింహ్మయాదవ్, సభ్యులు కలిశారు. ముఖ్యంగా ఔట్‌లెట్ లేక మురుగు సమస్యతో అవస్థల పాలవుతున్నారని, సీసీరోడ్లు, మౌలిక వసతులు కల్పించాలని వారు కోరారు. ఇందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

అమర్‌నాథ్ యాత్రికులకు ఉస్మానియాలో వైద్య పరీక్షలు

అఫ్జల్‌గంజ్: అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తులకు ఉస్మానియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ పర్యవేక్షణలో ముగ్గురు వైద్యులకు ఈ బాధ్యతలు అప్పగించారు. సోమ, గురువారాల్లో డాక్టర్ కేఎంకే రెడ్డి (కార్డియాలజీ) ఆధ్వర్యంలో అవుట్ పేషంట్ బ్లాకులోని రూమ్ నంబర్ 208 వద్ద, మంగళ, శుక్రవారాల్లో డాక్టర్ పి. శ్రవణ్‌కుమార్ (జనరల్ మెడిసిన్) ఆధ్వర్యంలో ఎంఆర్‌డీ బిల్డింగ్‌లోని రూం నంబర్ 507 వద్ద, బుధ, శనివారాల్లో డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి (ఆర్థోపెడిక్) ఆధ్వర్యంలో ఓపీ బ్లాకులోని రూమ్ నంబర్ 125 వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈసీజీ, 2డీ ఈకో, ఎక్స్‌రే వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. వైద్య పరీక్షలు నిమిత్తం వచ్చే వారు తమ ఆధారు కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 99896 76293 నంబర్‌లో సంప్రదించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగేందర్ తెలిపారు.